క్లుప్తంగా

పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలో చేపడుతున్న సమీకృత మార్కెట్, బస్తీ దవాఖాన, వైకుంఠధామం పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పనులను పరిశీలించారు. బస్తీ దవాఖానను ఫిబ్రవరి మొదటి వారంలోపు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి అన్నారు. ఈ మేరకు జగిత్యాలలోని నవ్య కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీపాద నరేశ్, కరస్పాండెంట్ ఈశ్వర్ పాల్గొన్నారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతి ప్రదానం

రాయికల్: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మదన్ మోహన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మైతాపూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల ముగింపు పోటీలకు ఆయన హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పార్టీ జిల్లా నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ రాజనాల మధుకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ, నాయకులు దుంపల రాజిరెడ్డి, మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, నక్క జీవన్, సతీశ్, విష్ణు, నాగిరెడ్డి రఘుపతి, చంద్రశేఖర్, ఏలేటి జలేందర్ పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కోరుట్లరూరల్: కోరుట్ల–రాయికల్, కోరుట్ల–జగిత్యాల రూట్లలో రవాణా, ఆర్టీసీ అధికారులు మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా, ఫిట్‌నెస్, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడుపుతూ ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న ఆటో, జీప్, టాటా ఏసీ వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. 30 వాహనాలను తనిఖీ చేయగా 10 వాహనాలను సీజ్ చేశామని, సుమారు రూ.2.30లక్షల జరిమానా విధించామని ఎంవీఐ రంజిత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రక్తదానం



రక్తదానం చేస్తున్న కానిస్టేబుల్ నయీం

జగిత్యాలక్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధరూర్ క్యాంప్‌నకు చెందిన సంతోషినికి అత్యవసరంగా ఎ పాజిటివ్ రక్తం అవసరం కాగా విషయం తెలుసుకున్న ధరూర్ క్యాంప్‌నకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ నయీం రక్తదానం చేశారు.

కరాటేతో ఆత్మరక్షణ

రాయికల్: కరాటే బాలికల్లో ఆత్మరక్షణ పెంచేందుకు దోహదపడుతుందని డీసీపీయూ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు 30 రోజుల ఉచిత కరాటే తరగతులను ప్రారంభించారు. సూపర్‌వైజర్ పద్మావతి, సర్పంచ్ కైరి ముత్తయ్య, ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు.

‘డబుల్’ కాలనీలో సౌకర్యాల లేమి

- ఒకే బోర్‌తో 41 ఇళ్లకు నీళ్లు
- భగీరథ పైప్‌లు వేసినా.. కనెక్షన్ ఇవ్వని అధికారులు
- డబుల్‌బెడ్రూం ఇళ్లకు వెళ్లే మార్గంలో రోడ్డు గుంతలమయం
- వీధిదీపాలు కరువు



గుంతలమయంగా డబుల్‌బెడ్రూం కాలనీకి వెళ్లే రోడ్డు

ఇబ్రహీంపట్నం: డబుల్‌బెడ్రూం ఇళ్లను అరకొర వసతులతో నిర్మించడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రారంభించి 8 నెలలు కావస్తున్నా.. అధికారులు వసతుల గురించి పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మండలకేంద్రం శివారులోని ధర్మసాగర్ కాలనీలో 41 ఇళ్లు నిర్మించేందుకు రూ.208.60లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించేందుకు జూన్ 9, 2017న అప్పటి నిజామాబాద్ ఎంపీ కవిత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ 41 ఇళ్లను పూర్తి చేశారు. కాగా ఏప్రిల్ 20, 2022న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఈ డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించారు.

ఒకే బోర్‌తో 41 ఇళ్లకు నీరు..

డబుల్‌బెడ్రూం ఇళ్లకు నీటి వసతి కల్పించేందుకు ఒకే బోర్‌తో 41 ఇళ్లకు నీరు అందించడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నీళ్ల కోసం కాలనీవాసులు గొడవలు పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం గ్రామపంచాయతీ నుంచి మరొక బోర్ వేయించగా ఇటీవల బోర్‌కు మోటార్ ఫీట్ చేసినప్పటికీ ఇంకా పైప్‌లైన్లకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీళ్లకోసం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కాలనీకి నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

భగీరథ పైప్‌లు వేసినా.. కనెక్షన్ ఇవ్వలేదు

డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీకి ఇంటింటికీ భగీరథ పైప్‌లు వేసినప్పటికీ అధికారులు కనెక్షన్ ఇవ్వలేదు. కొద్దిరోజుల క్రితం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కాలనీకి పైప్‌లు వేసినా.. భగీరథ నీళ్లు రావడం లేదని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దృష్టికి సభ్యులు తీసుకెళ్లారు. వెంటనే డబుల్‌బెడ్రూం ఇళ్లకు భగీరథ నీళ్లు వచ్చేలా కనెక్షన్ ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. కానీ ఇప్పటికీ అధికారులు కనెక్షన్ ఇవ్వలేదు.

గుంతల రోడ్డు, వీధిదీపాలు కరువు..

డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రారంభించినప్పటి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి డబుల్‌బెడ్రూం ఇళ్లకు వెళ్లేదారి గుంతలమయంగా ఉండడంతో ఒకచోట బురద గుంత ఉంది. రాత్రిపూట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి డబుల్‌బెడ్రూం కాలనీకి వచ్చేదారిలో వీధిదీపాలు లేకపోవడంతో మహిళలు భయపడుతున్నారు. కాలనీకి వచ్చే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రోడ్డు బాగుచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నీటి వసతి కల్పించాలి



డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రారంభించి 8 నెలలు అయినా ఒకే బోర్‌తో నీటి సరఫరా చేస్తున్నారు. ఒకబోర్‌తో 41 ఇళ్లకు నీళ్లు రావడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. భగీరథ పైప్‌లైన్లు వేసినా కనెక్షన్ ఇవ్వలేదు. అధికారులు స్పందించి కాలనీకి నీటి వసతి కల్పించాలి.

– నెలకట్ల రాజు, ఇబ్రహీంపట్నం

సీసీరోడ్డు వేయాలి



ఇబ్రహీంపట్నం గ్రామశివారులో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీ వరకు వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట రావాలంటే భయపడుతున్నాం. వీధి దీపాలు ఏర్పాటు చేసి కాలనీవరకు సీసీరోడ్డు చేయాలి.

– వెల్ముల నవ్య, ఇబ్రహీంపట్నం

త్వరలోనే కనెక్షన్ ఇస్తాం



డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీకి త్వరలోనే స్వచ్ఛమైన భగీరథ నీళ్లు వచ్చేలా చర్యలు చేపడుతాం. కాలనీ శివారులోని పెట్రోల్ బంక్ దగ్గర గేట్‌వాల్ ఉన్నందున అక్కడి నుంచి ప్రత్యేక పైప్‌లు వేసి పై అధికారుల ఆదేశానుసారం కనెక్షన్లు ఇచ్చి నీళ్లు అందిస్తాం.

– అఖిల్, భగీరథ ఏఈ, ఇబ్రహీంపట్నం

అటెన్షన్ ప్లీజ్



శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల

మేడిపెల్లి: భీమారం మండలం వెంకట్రావ్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతిలో 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారు 40ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పైకప్పు పగుళ్లు చూపి ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయంతో బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారు. నూతన పాఠశాల భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : నరేశం, మండల విద్యాశాఖ అధికారి
ఫోన్ నంబర్ 94915 63146

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



ఇబ్రహీంపట్నం: వర్షకొండలో ముగ్గుల పోటీలు



పెగడపల్లిలో విజేతలకు బహుమతి ప్రదానం

కథలాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికలకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఇబ్రహీంపట్నం, కొజకొత్తూర్, ఎర్దండి, కొమటికొండాపూర్‌లో జాతీయ బాలికల దినోత్సం నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే శిక్షణను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

పెగడపల్లి: స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతి ప్రదానం చేశారు.

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: ఆరోగ్య తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఈ మేరకు మంగళవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జగిత్యాలరూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించిందన్నారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, సర్పంచ్ దామోదర్, ఎంపీటీసీ సౌజన్య, డాక్టర్ జైపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ నర్సయ్య, పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

జగిత్యాలఅగ్రికల్చర్: వరిలో రైతులను వేధిస్తున్న కాండం తొలిచే పురుగు వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. జగిత్యాలరూరల్ మండలం అంతర్గాంలో వరిపొలాలను పరిశీలించిన ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి క్లస్టర్ పరిధిలో రైతులతో సమావేశాలు నిర్వహించి వరిలో వచ్చే తెగుళ్లు, పురుగులపై అవగాహన కల్పించాలన్నారు. రైతుబంధు సమితి జిల్లా సభ్యులు దామోదర్‌రావు, బాలె ముకుందం, ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి, సందీప్‌రావు, రైతుబంధు సమితి కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఏవో కల్పన, ఏవోలు తిరుపతినాయక్, వినీల, ముక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారు



ఆందోళన చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: గృహ వినియోగదారులపై విద్యుత్ సంస్థ ఏసీడీ చార్జీలు విధించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ఈఆర్‌వో కార్యాలయం ఎదుట మంగళవారం కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతుంటే ప్రస్తుతం అదనంగా ఏసీడీ చార్జీలు విధించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో విద్యుత్ సంస్థలు నష్టాలపాలయితే వాటిని అధిగవించడానికి ప్రజలపై భారం మోపడం బాధాకరమన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని, లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. బెజ్జారపు శ్రీనివాస్, కొమిరెడ్డి లింగారెడ్డి, హఫీజ్, తుమ్మనపల్లి రాంప్రసాద్, అందె మారుతి, రాజు పాల్గొన్నారు.

ఏసీడీ బిల్లులపై ఒత్తిడి తేవొద్దు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ఏసీడీ విద్యుత్ బిల్లుల వసూలు విషయంలో విద్యుత్ సిబ్బందిపై మంగళవారం గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు వసూలు చేసేందుకు సిబ్బంది రాగా ఏసీడీ పేరిట అధికంగా బిల్లులు వేశారని మండిపడ్డారు. ఏసీడీ బిల్లులు చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి తేవొద్దని స్థానిక నాయకులు సిబ్బందిని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి

అవసరమైన వాళ్లందరికీ కళ్లద్దాలు



శిబిరాన్ని పరిశీలిస్తున్న సమియోద్దీన్

కోరుట్లరూరల్: కంటి పరీక్షల అనంతరం ఎవరికైతే కళ్లద్దాలు అవసరమో వారికి తప్పనిసరిగా అందజేయాలని జిల్లా వైద్యారోగ్య ప్రోగ్రాం ఆఫీసర్ ఎండీ సమియోద్దీన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని సంగెం, జోగిన్‌పెల్లితో పాటు పట్టణంలోని ఆదర్శనగర్, ఆనంద్‌నగర్, బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాలను పరిశీలించారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండలంలోని గుండంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి వాహిని, సర్పంచ్ దనరేకుల మలు, ఎంపీటీసీ మామిడి మంజుల, ఉపసర్పంచ్ వేణు, వైద్యుడు డాక్టర్ రాహుల్‌శర్మ, ఆప్తమాలజిస్టు బోడ రమేశ్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర నాయకులు దనరేకుల సంతోష్‌యాదవ్ పాల్గొన్నారు.

చెరువు పూడిస్తే ఉపాధి కరువు



నిరసన వ్యక్తం చేస్తున్న గంగపుత్రులు

జగిత్యాలరూరల్: చెరువు పూడిస్తే ఉపాధి కరువవుతుందని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి చెరువు ముంపు ప్రాంతాన్ని ఉప్పరిపేటకుచెందిన ఓ వ్యక్తి మట్టిపోసి చదును చేయగా ఆగ్రహించిన గంగపుత్రులు అక్కడ నిరసన వ్యక్తం చేయడంతో పాటు పోసిన మట్టిని జేసీబీ సాయంతో తొలగించారు. రానున్న రోజుల్లో ఎవరైనా ముంపు ప్రాంతాన్ని పూడ్చివేస్తే ఆందోళన చేస్తామని పేర్కొన్నారు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కోరుట్లటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని శ్రీనారాయణ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కరస్పాండెంట్ పి.జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మార్కండేయ జయంతి



కోరుట్ల, కోరుట్లరూరల్: ఎమ్మెల్యేకు సన్మానం



రాయికల్: పూజల్లో నాయకులు



బుగ్గారం: ఆలయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మల్లాపూర్‌లోని భరతమాత కూడలి వద్ద

కోరుట్ల, కోరుట్లరూరల్/రాయికల్/కొడిమ్యాల/మేడిపెల్లి/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/కథలాపూర్/బుగ్గారం: జిల్లావ్యాప్తంగా పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ ఆలయాల్లో విశేషపూజ, అభిషేకం, ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త మార్కండేయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వీధుల్లో మార్కండేయ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

షర్మిలమ్మ పాదయాత్రకు వేలాదిగా తరలిరావాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

మల్యాల: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలమ్మతోనే సామాజిక న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యరాజ్‌వర్మ అన్నారు. 28న పునః ప్రారంభించనున్న పాదయాత్రకు ప్రజలకు తరలించేందుకు మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. అనంతరం మల్యాల మండల కేంద్రంలో వైఎస్సార్‌టీపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి కాముని గంగాధర్, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి జాడి ప్రేమ్‌సాగర్, బీఎస్ మమత యాదవ్‌తో కలిసి సత్యరాజ్‌వర్మ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సంక్షేమ పాలన షర్మిలమ్మ నాయకత్వంలోనే దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు.

బహుమతి ప్రదానం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ మిషన్‌పై చిత్రలేఖన పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి ఎం.దేవిక, ద్వితీయ బహుమతి బి.దివ్య, తృతీయ బహుమతి బి.మనీష గెలుపొందారు.

సంక్షిప్త వార్తలు

✦గర్భిణులకు సీమంతం

రాయికల్: పట్టణంలోని ఒడ్డెరకాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

✦ఎస్‌ఎస్వీ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

జగిత్యాల: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్, వారి నాంది ఫౌండేషన్ మహేంద్ర రైజ్ వారి సౌజన్యంతో ఎస్‌ఎస్వీ కళాశాలలో 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ యాద రామకృష్ణ తెలిపారు.

✦ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సన్మానం

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ నర్సప్పను మంగళవారం స్థానికులు సన్మానించారు. జగిత్యాల డిపో నుంచి గొల్లపల్లి మండలం అగ్గిమల్ల నుంచి, పెగడపల్లి మండలం శాలపల్లి, లింగాపూర్‌కు బస్ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ మేనేజర్‌ను సన్మానించారు.

✦పశువైద్య శిబిరం వినియోగించుకోవాలి

మెట్‌పల్లి: పశువైద్య శిబిరాలను పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మారు సాయిరెడ్డి సూచించారు. ఈ మేరకు మండలంలోని చౌలమద్దిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా అధికారి గోపాలకృష్ణమూర్తితో కలిసి ఎంపీపీ ప్రారంభించారు.

✦విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కోరుట్లరూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని బీజేపీ నాయకులు సురభి నవీన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కల్లూరు మోడల్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సర్పంచులు గుగ్గిళ్ల తుక్కరాం గౌడ్, వనతడుపుల అంజయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు పంచిరి విజయ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ నర్సయ్య పాల్గొన్నారు.

✦బ్రహ్మోత్సవాలకు టెండర్లు పూర్తి

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాలకు అధికారులు టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. వచ్చే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు, బెల్లం, పూజా సామగ్రి అమ్మకం కోసం రూ.6.20లక్షలు, జాతరలో లైటింగ్, అలంకరణ కోసం రూ.39,640, టెంట్ల ఏర్పాటుకు రూ.56,516తో సీల్డు టెండర్ల ద్వారా టెండరుదారులు హక్కులు పొందారు. ఎంపీపీ కోల జమున, ఆలయ ఈవో కొస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, దేవాదాయ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి పాల్గొన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతి



రవీందర్‌కు బైక్ అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: అదృష్టం ఉంటే వరిస్తాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలకు చెందిన ప్రముఖ యశస్వీ కంపెనీ లక్కీడ్రా చేపట్టింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం డ్రా తీశారు. మొదటి బహుమతి జగిత్యాలకు చెందిన సట్ట రవీందర్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్ రాగా, బంపర్ బహుమతి జగిత్యాలలోని విద్యానగర్‌కు చెందిన వి.రాంరెడ్డికి వచ్చింది. శామ్‌సంగ్ ప్రతినిధులు ఆనంద్ సల్ల, సందీప్ చౌహాన్, యశస్వీ యజమాని కోటగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.